# సైనికుడుగా మారుతున్న పోకిరికి జన్మదిన శుభాకాంక్షలు.




1975 వ సంవత్సరం, ఆగస్టు 9వ తేదీన ఘట్టమనేని మహేష్ బాబు జన్మించారు.తనను అభిమానులు 'ప్రిన్స్' అని పిలుచుకునే ఘట్టమనేని మహేష్ బాబు ఆ పదానికి సరిగ్గా సరిపోయే ఆరడుగుల ఎత్తు, వెడల్పు, అందం, ఆకర్షణ, వీటికి తోడు చక్కని నటనతో ఆంధ్ర ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. తనతండ్రి, సూపర్ స్టార్‌గా అభిమానులు అభిమానంగా పిలుచుకునే ఘట్టమనేనికృష్ణకు రెండో కుమారుడిగా జన్మించిన మహేష్ బాబు బాలనటుడిగా తెలుగు చలన చిత్ర రంగ ప్రవేశం చేశారు.

చిన్నప్పుడు బొద్దుగా, ముద్దుగా ఉండే మహేష్ బాబుకీ, ఇప్పటి ప్రిన్స్ మహేష్‌బాబుకీ చాలా తేడా ఉంది. బాలనటుడిగా ముగ్గురు కొడుకులు, పోరాటం, శంఖారావం, గూఢచారి 117, బాలచంద్రుడు, కొడుకు దిద్దిన కాపురం చిత్రాల్లో నటించి, హీరోగా రాజకుమారుడు చిత్రంతో మళ్ళీ రంగప్రవేశం చేశారు. తాను హీరోగా నటించిన తొలి చిత్రమే 42 సెంటర్లలో 100 రోజులు ఆడిన ఘనత ప్రిన్స్‌ది.

ఆ తర్వాత వంశీ, యువరాజు, బాబీ, నానీ, మురారి, టక్కరిదొంగ ఒక్కడు, నిజం, అర్జున్, అతడు, పోకిరి చిత్రాల్లో నటించి, ఇప్పుడు సైనికుడుగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ప్రిన్స్‌కి 'మురారి' చిత్రం ముందుగా మంచి నటుడిగా, హీరోగా ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చిన తొలి విజయం. ఆ తర్వాత గుణశేఖర్ దర్శకత్వంలో, సుమంత్ ఆర్ట్స్ పతాకంపై, యమ్.యస్.రాజు నిర్మించిన "ఒక్కడు" చిత్రం అందరినీ ఆశ్చర్యంలో ముంచేస్తూ మహేష్ బాబుకి స్టార్ ఇమేజ్‌ని సంపాదించిపెట్టింది. ఈ చిత్రం ఒక నటుడిగా, హీరోగా మహేష్ బాబు స్టామినాని వెలికి తీసిందనే చెప్పాలి. "అతడు" చిత్రం కూడా అదే బాటలో నడిచింది. కానీ "నిజం","నాని","అర్జున్" చిత్రాలు ఆయన్ని, ఆయన అభిమానులను నిరాశపరచాయి.



ఈ చిత్రాలెంత నిరాశపరిచినా ఒక్క "పోకిరి" చిత్రం వసూళ్ళతో, తెలుగుచలన చిత్ర పరిశ్రమలో ఒక హీరో స్టార్‌డమ్‌కున్న పరాకాష్ట ఏమిటో నిరూపించి, 75 యేళ్ళ తెలుగు చలనచిత్ర చరిత్రని తిరగరాసి, చరిత్ర సృష్టించిన ఏకైక హీరో 'ప్రిన్స్' మహేష్ బాబు. పోకిరిలో ఆయన మేనరిజమ్స్, వాకింగ్ స్టైల్, డైలాగ్ మాడ్యులేషన్‌లో విభిన్నత, ప్రేక్షకుల్ని సమ్మోహితులను చేశాయి.

తాను ఎవరికీ పోటీ కాదనీ, తనకు ఎవరూ పోటీ కాదనే ప్రిన్స్ ఏ సినిమా హిట్ అయినా ఆనందించటం మహేష్ బాబు సంస్కారాన్ని తెలుపుతుంది. పసిపిల్లాడిలా కల్మషం లేని చిరునవ్వుతో, చక్కని సంస్కారంతో, అద్భుతమైన నటనతో, తండ్రిని మించిన తనయుడిగా, ఒరిగిపోతున్న తెలుగు చిత్ర సీమకు కొత్తవెలుగులతో, నూతన జవసత్వాలను అందిస్తున్న మహేష్ బాబుకి ఈనాడు యావదాంధ్ర అభిమానులుగా మారారంటే అతిశయోక్తి కాదు.

"ఆ హీరో సినిమా ఫ్లాప్ అంటగా" అని పార్టీలు చేసుకునే వాళ్ళంటే తనకు చాలా అసహ్యం అని చెప్పే మహేష్ బాబు తెలుగు చలన చిత్ర పరిశ్రమకు సూపర్ స్టార్ ద్వారా దొరికిన వెలకట్టలేని వజ్రం. భవిష్యత్తులో పోకిరిని మించిన మరిన్ని ఘన విజయాలు ప్రిన్స్ సాధించాలని ఆశిస్తూ ....డి.యమ్.కె.